# క్లుప్తంగా

## గురుకుల కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కళాశాల సిబ్బంది సొంత ఖర్చులతో ఏర్పాటు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ లేకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో తాను, కళాశాల సిబ్బందితో కలిసి సొంత ఖర్చులతో కంప్యూటర్‌లను కొనుగోలు చేసి ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) చదువుతున్న విద్యార్థినులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వీధి వ్యాపారులు పేర్లు నమోదు చేసుకోండి

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, వీధులు వెంబడి వ్యాపారాలు చేసుకునే వీధి విక్రయదారులందరికీ సర్వే నిర్వహిస్తున్నామని, వారంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గతంలో నగరంలో 17వేల మంది వీధి విక్రయదారులను గుర్తించామని, అప్పుడు నమోదు చేసుకోని వారంతా తాజాగా నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేకు వీఎంసీ వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు, వీఎంసీ పట్టణ సాధికార విభాగం రిసోర్స్ పర్సన్‌లు వస్తారని.. వారికి రూ. 200 చెల్లించి, ఏ రకమైన వ్యాపారం చేస్తున్నారు?, ఎంతకాలం నుంచి చేస్తున్నారు? ఎక్కడ వ్యాపారం చేస్తారు? అనే ప్రశ్నలతో సర్వే చేస్తారని, సర్వే అనంతరం వీధి వ్యాపారాలకు అడ్డంకులు లేకుండా టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డును అందిస్తారని అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునేవారంతా ఈ సర్వేలో తమ పేర్లు, వ్యాపారాలు నమోదు చేసుకుని అడ్డంకులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ కార్యవర్గం ఎన్నిక



**రామవరప్పాడు:** రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ 83వ నూతన కార్యవర్గ నియామక కార్యక్రమం శుక్రవారం రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ పేదలకు, విద్యార్థులకు, మహిళలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం 2024–25 రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలిగా విధులు నిర్వహించిన డాక్టర్ వి. శ్రీదేవి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది రోటేరియన్ ఎస్. బాలగోపాల్‌కు పదవీ బాధ్యతలను అప్పగించారు. నూతన కార్యదర్శిగా ఎం. రాంగోపాల్‌రావు, కోశాధికారిగా జి. భానుప్రకాష్ నియమితులయ్యారు. వీరిచే రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సుమారు రూ. 2లక్షలు విలువజేసే స్ట్రీట్ ఫుడ్ కార్ట్, పాఠశాల విద్యార్థులకు 3 సైకిళ్లు, 13 కుట్టు మిషన్లు, 21 రైస్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథి తాడికొండ శ్రీరామ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సుదీప్తి, ఇతర రోటరీ క్లబ్‌ల జిల్లా గవర్నర్లు, రోటేరియన్లు, రోటారాక్టర్లు, పూర్వ అధ్యక్షుడు ఎం.వి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తే భవిష్యత్తు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా విద్యాబోధన ఉంటుందని.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపాలని ఎంకే బేగ్ మునిసిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు సూచించారు. ఆ పాఠశాల ఆవరణలో సింగ్‌నగర్ లూనాసెంటర్, లెనిన్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక సైన్స్ లేబరేటరీలు, విశాలవంతమైన ప్లే గ్రౌండ్‌లు, ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ, లైబ్రరీ వంటి అనేక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు మైనం హుస్సేన్, ప్రకాష్, హవీలా, సైదా, సంజీవరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏడాదిలోనే తప్పటడుగులు

- విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి, కూటమి మోసం
- రూ. 15వేల కోట్లు భారం మోపారు
- ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నాలో సీపీఎం నాయకులు



విజయవాడలోని ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

**మొగల్రాజపురం (విజయవాడ తూర్పు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే విద్యుత్ చార్జీలను పెంచి.. తప్పటడుగులు వేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 'స్మార్ట్ మీటర్లపై పోరుబాట' పేరుతో సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా శుక్రవారం జరిగింది. స్మార్ట్ మీటర్లు అమర్చవద్దు అంటూ ప్రజల నుంచి సేకరించిన వేల సంఖ్యలో దరఖాస్తులను తమ ముందు గుట్టలుగా పేర్చి నాయకులు ధర్నా చేశారు. బాబూరావు మాట్లాడుతూ పవర్(విద్యుత్) జోలికి వస్తే పవర్(అధికారం) పోతుందని ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే విద్యుత్ సర్దుబాటు చార్జీల రూపంలో రూ.15,485కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపిందన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో విద్యుత్ బిల్లులను చెల్లించలేక చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు మూతపడుతున్నాయని చెప్పారు. జీవనోపాధి లేక చాలా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అయినా పాలకుల్లో కనికరం లేకుండా ఈ విద్యుత్ భారాలకు తోడుగా స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికి అమర్చడానికి కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులే ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు.

**అదాని పరం చేసేస్తున్నారు..**

రాష్ట్రాన్ని, విద్యుత్ రంగాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి ఉమ్మడిగా అదాని పరం చేస్తున్నారని బాబూరావు ఆరోపించారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని క్రమంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ మొత్తాన్ని అదాని కంపెనీలకు కూటమి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ యజమానుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను బిగించడానికి అధికారులు ప్రయత్నిస్తే వినియోగదారులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విద్యుత్‌శాఖాధికారులపై కేసులు నమోదు చేయాలన్నారు. సీపీఎం నాయకులు బి. రమణరావు, బోయి సత్యబాబు, పి.కృష్ణ, కె.దుర్గారావు, ఈవీ.నారాయణ, క్రాంతి, సూరిబాబు, చిన్నారావు, శేఖర్, రమణ, సరోజ, ఆదిలక్ష్మి, ఝాన్సీతో పాటుగా అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సేకరించిన దరఖాస్తులను గుట్టలుగా పోసి నిరసన వ్యక్తం చేశారు.

# ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

**పటమట(విజయవాడతూర్పు):** జవహర్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం) ఇళ్లలో నివసించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం కొత్త రాజరాజేశ్వరిపేట, డాబా కొట్ల సెంటర్, అజిత్ సింగ్ నగర్, అయోధ్య నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లలో మురుగు నీటి పారుదలకు తగిన చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కొత్త రాజరాజేశ్వరిపేట రైల్వే ట్రాక్ వద్ద నిర్మాణ దశలో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌ని పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జున్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జాతీయ పతాక రూపశిల్పి పింగళికి ఘన నివాళి



పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం బాపు మ్యూజియంలోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో జరిగిన కాంగ్రెస్ సమావేశాలలో పింగళి వెంకయ్య జాతీయ జెండాను ప్రవేశపెట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తిని చాటే విధంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి బాపు మ్యూజియంలో పింగళి విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తు చేశారు. పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, ఆయన ఒక లెక్చరర్, రచయిత, భూవిజ్ఞాన శాస్త్రవేత్త, విద్యావేత్త, వ్యవసాయదారుడు, బహుభాషావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి వెన్నం రత్నరావు, క్లస్టర్ ప్రధాన కార్యదర్శి మురళి కృష్ణంరాజు, చల్ల సుధాకర్, జయకర్, ఒగ్గు విక్కి తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శప్రాయుడు అల్లూరి

విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర



అల్లూరికి నివాళ్లర్పించిన వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

**పటమట(విజయవాడతూర్పు):** అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం, దేశభక్తి అందరికీ మార్గదర్శకమని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. వీరిరువురూ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**చిరస్థాయిగా నిలిచిపోతారు..**

కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అల్లూరి మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయనకు నివాళులు అర్పించడం గర్వకారణమన్నారు. చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యనారాయణ, అకౌంట్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు.

**ముత్యాలంపాడులో..**

ముత్యాలంపాడు శ్రీ గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, కార్పొరేటర్ పెనుమత్స శిరీష, శర్వాణీమూర్తి, మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు అతిథులుగా పాల్గొని అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

**ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**అల్లూరి స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలి**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** విజయవాడ క్షత్రియ యువజన సంఘం, క్షత్రియ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం బుడమేరు వంతెన సెంటర్‌లో నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ బీసీ చైర్మన్ మంతెన రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వి. సూర్యనారాయణరాజు, బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రఘు రామరాజు ప్రసంగించారు.

**దేవీనగర్‌లో..**

దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో 30వ డివిజన్ కాపు సేవాసంఘం ఆధ్వర్యాన శుక్రవారం వంగవీటి జయంతి వేడుకలు జరిగాయి. వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



రామకృష్ణాపురంలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా తదితరులు

**వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..**

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనంలో అల్లూరి సీతారామరాజు, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నాయకులతో కలిసి ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయంలో కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ రుహుల్లా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

## అల్లూరి త్యాగం అజరామరం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** స్థానిక రామకృష్ణాపురం అల్లూరి సీతారామరాజు సర్కిల్‌లో శుక్రవారం విప్లవ వీరుడు అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ శర్వాణి మూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ప్రధాన కార్యదర్శి టి. మురళీకృష్ణం రాజు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

# చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి

ఏపీ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్, సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్



ఏపీ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సముద్ర

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో ఏపీ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్, ఏపీ సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ సమావేశాలు వేర్వేరుగా జరిగాయి. సమావేశంలో డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సముద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సినిమా నిర్మాణానికి అనువైన లొకేషన్స్ ఉన్నాయన్నారు. ఆయా లొకేషన్స్‌లో ఇప్పటికే సినిమా షూటింగ్స్ జరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తే పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై త్వరలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఉపాధ్యక్షుడు గూడా రామకృష్ణ మాట్లాడుతూ చలన చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఇళ్లు కేటాయించిందని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరారు. ప్రధాన కార్యదర్శి తోరం రాజా మాట్లాడుతూ మన రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే అవసరమైన స్టూడియోలు, రికార్డింగ్, డబ్బింగ్ థియేటర్స్ ఏర్పాటు కావాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి శగ్గం శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వి.రమణ, సహాయ కార్యదర్శి కొల్లి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తాం..**

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, అందుకు యూనియన్ తరఫున తమ వంతుగా సహకరిస్తామని సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేశామన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. సమావేశంలో అధ్యక్షుడు బండ్రెడ్డి శశి కుమార్, ఉపాధ్యక్షుడు చీతిరాల నాగమధు, ప్రధాన కార్యదర్శి కొడదల శివప్రసాద్ రెడ్డి, కోశాధికారి ఊబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ఆంధ్రా షిర్డీగా పేరుగాంచిన ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన వారాహి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజైన అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. శ్రీలలిత సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం తొమ్మిది రోజుల పాటు వారాహి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

**దావు బుచ్చయ్యకాలనీలో..**

దావు బుచ్చయ్యకాలనీ శ్రీశ్యామలాంబదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు లోక కల్యాణార్థ వారాహి ఛండీహోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

# ప్రజా నాయకుడు వీఎం రంగా



వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



గులాబీతోటలో రంగా విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

**పాయకాపురం(విజయవాడరూరల్):** ప్రజా సమస్యల కోసమే పోరాటం చేసిన నిజమైన ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగారావు అని సెంట్రల్ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం రాజీవ్‌నగర్లో 63వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పసుపులేటి ఏసు ఆధ్వర్యంలో జరిగిన రంగా జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని రంగా చిత్ర పటం, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీఎంసీ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆశ్రమానికి స్టాండ్ ఫ్యాను బహూకరించారు. అలాగే పాయకాపురం, పైపుల రోడ్డులోని రంగా విగ్రహాల వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో మల్లాది పాల్గొన్నారు.

**మధురానగర్‌లో..**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** స్థానిక మధురానగర్ శివాలయం సమీపంలో శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కేక్ కట్‌చేసి, మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, బోనం నాగు, దేవినేని సుధాకర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు. గులాబీతోటలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 28వ డివిజన్‌లో జరిగిన వేడుకలలో కార్పొరేటర్ వీరమాచనేని రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఘన నివాళులు..**

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** స్థానిక సత్యనారాయణపురంలోని ఎన్ఆర్‌పీ రోడ్డులోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు దాసరి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, లంక బాబు, దోనేపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహానుభావులకు మహా నివాళి

**విజయవాడలీగల్:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యల జయంతి వేడుకలను బెజవాడ బార్ అసోసియేషన్ శుక్రవారం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా అధ్యక్షత వహించారు. మాజీ అధ్యక్షులు చోడిశెట్టి మన్మథరావు, సీనియర్ న్యాయవాది, మాజీ కార్పొరేటర్ కునుకు రాజశేఖర్, అల్లూరి సీతారామరాజు అవార్డు గ్రహీత వేముల హాజరత్తయ్య గుప్తా ప్రసంగించారు. సీనియర్ న్యాయవాది గురునాథం, పుప్పాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, గవర్నింగ్ బాడీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# మెడికోలపై పోలీసుల దాడి దుర్మార్గం

**విజయవాడలీగల్:** శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలపై పోలీసుల దాడి అప్రజాస్వామికమని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) పేర్కొంది. శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో వక్తలు మాట్లాడుతూ పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌ల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువ వైద్యులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో మెడికల్ కోర్సులు పూర్తిచేసిన వందలాది యువ వైద్యులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం చాలా రోజుల నుంచి ప్రభుత్వ పెద్దలను కలిసినా వారి వైపు నుంచి స్పందన లేకపోవడంతో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వైద్యులపై గురువారం విజయవాడలో మూకుమ్మడిగా పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని, ప్రతి నిరసనను పోలీసుల ద్వారా అణచివేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. వెంటనే యువ వైద్యులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని, వారిని వైద్యులుగా గుర్తించాలని, నిన్న వైద్యులపై జరిపిన దాడి కేసులో పోలీసులను శిక్షించాలని ఐలాజ్ డిమాండ్ చేసినట్లు వివరించారు.

## ఎస్ఎన్ పురంలో సీఎంపై ఫిర్యాదు



**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** ఎస్సీ సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సింగయ్య కేసు ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉందన్నారు. ఇటువంటి సున్నితమైన విషయంలో ప్రజాప్రతినిధులు న్యాయ ప్రక్రియకు భంగం కలిగించకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సి ఉందన్నారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 1న కొవ్వూరు, 2న కుప్పంలోని సమావేశాల్లో మృతుని గురించి మాట్లాడుతూ 'కుక్క మాదిరిగా తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు' అనడాన్ని ఎస్సీ సామాజికవర్గం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిరంశెట్టి పూర్ణచంద్రరావు, బూదాల శ్రీనివాసరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు గవస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 10న టీచర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న టీచర్ ఉద్యోగాలను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు ఈనెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. ఆది శేషశర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోషల్, ఇంగ్లిష్, ఒకేషనల్ కోర్సు, సంగీతం, గైడెన్స్ అండ్ కౌన్సిలర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించి కాంట్రాక్టు పద్ధతిపై నియామకం చేయనున్నట్లు ఆయన తెలిపారు.